సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



మాణిక్యాంబకు వెండి కవచం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరునికి ఆలయ పురోహితుడు ఆంజనేయశర్మ కుమార్తె మంగళంపల్లి సుబ్బలక్ష్మీదీప్తి దంపతులు రూ.2 లక్షల విలువైన వెండి కవచం సమర్పించారు.




ఎంచుకుని.. పంచుకుని

నీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నో సిత్రాలు జరిగాయి.. అధికార పార్టీలకు చెందిన నేతలు తమకు నచ్చిన చోట పాగా వేసేందుకు ఎంచుకుని పంచుకున్నారు..

8లో

డెల్టాలకు 11,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 11,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. మరో 6,384 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జాబ్ మేళా రేపు

ముమ్మిడివరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొనే ఈ మేళాలో 200 వరకూ ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీడీఎం ఫార్మసీ, పీజీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్, ఐడీ అండ్ ప్రూఫ్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు శ్రీదేవి 83416 48470, రాజేంద్ర 82476 45389 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలాజీ సన్నిధి... భక్తజన పెన్నిధి



అప్పనపల్లి బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువు దీరిన శ్రీబాల బాలాజీస్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. వేకువ జామున సుప్రభాత సేవతో అర్చకులు స్వామి వారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం తొలి హారతిని వైభవంగా జరిపించారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఉభయ దేవేరులతో బాల బాలాజీ స్వామి భక్తులకు కన్నుల పండుగలా దర్శనమిచ్చారు. స్వామివారి దివ్య తేజస్సును దర్శించుకున్న భక్తులు ఆనంద పరవశితులయ్యారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,78,287 ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం విక్రయాలతో రూ.61,200, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.86 వేల ఆదాయం లభించింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.57,630 విరాళాలుగా అందించారని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత బంధువుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తొత్తరమూడికి చెందిన లక్కింశెట్టి బాబి చేతుల మీదుగా ఆయన బంధువులు కట్టమూరి అన్నపూర్ణేశ్వరరావు, అనురాధ దంపతులు శనివారం రూ.51 వేల విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజుకు ఇచ్చారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పొమ్మన్నారు.. పొట్టకొట్టారు

- ఈ నెలలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 138 మంది హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు
- మరో 246 మందిపై ఉద్వాసన కత్తి
- 22 ఏళ్ల సేవలకు ఇదేనా బహుమతి
- గతంలో 217 మందిని క్రమబద్ధీకరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఆలమూరు: బాబు వస్తే జాబు వస్తుందంటూ గత సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు ముమ్మర ప్రచారం చేశారు. ఊరూ వాడా ఊదరగొట్టారు.. ఇప్పుడు బాబు వచ్చాడు.. జాబు తీసేస్తున్నాడంటూ అంతా నిట్టూర్పు వదులుతున్నారు. దశల వారీగా వివిధ శాఖల్లో ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నారు. జిల్లాలో పలు శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లలో కొంతమందిని కూటమి ప్రభుత్వం తొలగించింది. గత వైఎస్సార్ సీపీ హయాంలో నియమించిన గ్రామ వలంటీర్లను, మద్యం షాపుల్లో సిబ్బందిని తొలగించిన ప్రభుత్వం మళ్లీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిపై పడింది. 22 ఏళ్లుగా క్షేత్ర స్థాయిలో సేవలు అందిస్తున్న మేల్ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఎంపీహెచ్‌ఏ-ఎం)ను తెలంగాణ హైకోర్టు తీర్పు పేరిట ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 1,207 జీఓపై ఉద్యోగాల్లో చేరిన 138 మందిని ఈ నెల 5న ఏకపక్షంగా తొలగించింది. ఈ హెల్త్ అసిస్టెంట్ పోస్టులపై వివాదం కొనసాగుతున్నా ఈ ఏడాది మార్చిలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన 217 మందిని క్రమబద్ధీకరించి తమ ఉదారతను చాటుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది.

ఉద్యోగాల భర్తీ నుంచి వివాదమే!

పదో తరగతి విద్యార్హతగా అప్పటికే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా శిక్షణ పొంది ఉన్న నిరుద్యోగుల నుంచి 217 మేల్ హెల్త్ అసిస్టెంట్ల భర్తీకి 2002 జూలైలో అప్పటి టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అదే ఏడాది ఆగస్టులో రాత పరీక్ష నిర్వహించి 2003 జూన్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏళ్ల తరబడి ఈ పోస్టుల విషయంలో వివాదమే కొనసాగుతోంది. నోటిఫికేషన్‌లో పదో తరగతి అర్హత అని ప్రకటించినా పోస్టుల భర్తీ మాత్రం ఇంటర్ అర్హతతో మేల్ హెల్త్ అసిస్టెంట్ల భర్తీ జరిగింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉద్యోగం పొందినా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందిన పదో తరగతితో అర్హత సాధించిన ఉద్యోగులు అప్పటి హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టులో వాదోపవాదాల అనంతరం 2006లో పదో తరగతి అర్హతతో ఉద్యోగాలు పొందిన నిరుద్యోగులకు సానుకూలంగా తీర్పును వెలువరించింది. ఆ సమయంలో 121 మంది మేల్ అసిస్టెంట్లు తిరిగి ఉద్యోగాలు పొందారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మేల్ హెల్త్ అసిస్టెంట్ల సంఖ్య 338కు చేరుకుంది. ఆ సమయంలో ఉద్యోగం రాని కొందరు నిరుద్యోగులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులకు మించి ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపిస్తూ మళ్లీ హైకోర్టుకు వెళ్లడంతో వివాదం తలెత్తింది. 2012లో ఇంటర్, పదో తరగతి అర్హతతో శానిటరీ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులతో అధికారులు మరో మెరిట్ లిస్టు తయారు చేశారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఖాళీలకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి, మిగిలిన వారిని విధుల నుంచి తొలగించారు. ఈ ప్రక్రియలో అప్పటికే పదేళ్లు ఉద్యోగం చేసిన చాలామంది రోడ్డున పడ్డారు. ఉద్యోగంలో నుంచి తొలగించిన వారు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి 2013లో అప్పటి పంచాయతీరాజ్ శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం నియమించింది.

1207 జీవోపై మళ్లీ ఉద్యోగాలు

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ 1207 జీవోను విడుదల చేసి అప్పటికే తొలగించిన 121 మందిని మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకుంది. అప్పటికే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో వివాదాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో సమస్యపై అధ్యయనం చేసిన ఉప సంఘం మెరిట్, రోస్టర్ అవసరం లేకుండా విద్యార్హతలను పరిగణనలోకి తీసుకోకుండా పదేళ్ల పాటు పనిచేసిన వారందరూ తిరిగి విధుల్లోకి చేరారు. ఈ వివాదాస్పద జీఓను ఆసరాగా తీసుకుని శానిటరీ కోర్సు పూర్తి చేసిన 246 మంది నిరుద్యోగులు కోర్టుకు వెళ్లి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు పొంది ఉద్యోగాల్లో చేరారు. 2002లో కేవలం 217 మంది నియామకాలకే నోటిఫికేషన్ వెలువడగా, 584 మంది ఉద్యోగాలు పొందడంపై మిగిలిన నిరుద్యోగులు మళ్లీ హైకోర్టుకు వెళ్లారు. దీంతో 2002లో రాత పరీక్ష రాసి ప్రతిభ ఆధారంగా ఎంపికైన 217 మంది మాత్రమే ఉద్యోగాలు అర్హులని 2024 ఈ నెల 5న తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. తదనంతరం జరిగిన నియామకాలు చెల్లవని, మంత్రి ఉప సంఘం సిఫార్సులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో ఇప్పటికే 138 మంది ఉద్యోగాలు కోల్పోగా, మరో 246 మంది మెడపై ఉద్వాసన కత్తిని ప్రభుత్వం పెట్టింది.

టీడీపీ అనాలోచిత నిర్ణయమే కారణమా!

హెల్త్ అసిస్టెంట్ల జీవితాలు దుర్భరంగా మారడానికి 2002లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అనర్హులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో తీసుకున్న అనాలోచిన నిర్ణయాలే కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. 22 ఏళ్ల పాటు కాంట్రాక్టు పద్ధతిలో నామమాత్రపు వేతనాలతో వెట్టిచాకిరీ చేయించుకుని హఠాత్తుగా తొలగించడం అత్యంత దారుణమని అంటున్నారు. అన్యాయానికి గురైన హెల్త్ అసిస్టెంట్లు హైకోర్టు వరకూ వెళ్లడంతో ఆగ్రహం చెందిన ఐఏఎస్ క్యాడర్ అధికారి ఒకరు ప్రభుత్వానికి ఇచ్చిన తప్పుడు సలహాతో రాష్ట్రంలో వేలాది మంది హెల్త్ అసిస్టెంట్లు రోడ్డున పడాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ అసిస్టెంట్ల తొలగింపుతో గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య, ఆరోగ్య సేవలు కుంటుపడుతున్నాయి.



సంధిపూడిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న హెల్త్ అసిస్టెంట్



గోపాలపురంలో కుష్టు వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బందితో హెల్త్ అసిస్టెంట్

హెల్త్ అసిస్టెంట్ల విధులివీ..

- జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించడం ద్వారా వ్యాధి నిర్మూలనకు కృషి చేయడం, జాతీయ దినోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించడం.
- గ్రామ పంచాయతీ సిబ్బందితో అనుసంధానంగా ఉంటూ సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించడం, నిర్ణీత సమయానికి వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించడం.
- ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించి అంటువ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించడం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించి విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షించడం.
- ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ప్రజలకు వివరించి క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందించడం.
- ప్రకృతి వైపరీత్యాలు, వరదల సమయంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుధ్య సాధించి ప్రజల ఆరోగ్యానికి బాటలు వేయడం.

మాపై వివక్ష వీడాలి



రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ అసిస్టెంట్లపై వివక్ష విడనాడాలి. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న సమయంలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. ఉద్యోగాలను తొలగించి హెల్త్ అసిస్టెంట్లను రోడ్డుపై నిలబెట్టింది. ప్రభుత్వం పునరాలోచించి మా ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలి.

– ఎస్.గోవిందరాజు, హెల్త్ అసిస్టెంట్, గాడిమొగ పీహెచ్‌సీ

తొలగింపు అన్యాయం



22 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయం. అప్పుడు మంచి మార్కులు వచ్చాయని ఉద్యోగమిచ్చిన ప్రభుత్వమే మళ్లీ హఠాత్తుగా ఉద్యోగం నుంచి తీసేసింది. ఈ వయసులో మాకు ఉద్యోగం లేకపోతే కుటుంబాన్ని ఏవిధంగా పోషించుకోవాలో ప్రభుత్వమే చెప్పాలి.

– ఆర్.నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ల సమాఖ్య రాష్ట్ర నేత, పెదపళ్ల పీహెచ్‌సీ

ఆత్మహత్యలే శరణ్యం



ఏళ్ల తరబడి క్షేత్రస్థాయిలో ప్రజలకు విశేష సేవలు అందించాం. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవ చేశాం. అవేవీ పట్టించుకోకుండా ఉద్యోగాలు ఊడగొట్టి మమ్మల్ని రోడ్డున పడేయం దారుణం. ప్రభుత్వం స్పందించి ఉద్యోగాలు పునరుద్ధరించకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

– ఎస్‌కే అలీ, హెల్త్ అసిస్టెంట్, ధవళేశ్వరం పీహెచ్‌సీ

జీవనోపాధిపై ప్రభావం



రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేస్తూ వచ్చిన చాలీచాలని జీతంతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. హఠాత్తుగా ఉద్యోగం నుంచి తొలగించి ఇంటికి పంపడంతో జీవనోపాధి కరవైంది. వచ్చే నెల నుంచి జీతం అందకపోతే మా కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

– మేడిశెట్టి కుమార్, హెల్త్ అసిస్టెంట్, ఉప్పాడ పీహెచ్‌సీ

పర్మినెంట్ చేస్తారని అనుకుంటే పొమ్మన్నారు



విధి నిర్వహణలో 25 వసంతాలకు దగ్గరవుతుండడంతో ఉద్యోగాన్ని పర్మినెంట్ చేసి పూర్తి స్థాయి వేతనం ఇస్తారనుకుంటే అర్ధాంతరంగా తొలగించి ఇంటికి పొమ్మన్నారు. తీర్పును వెలువరించిన హైకోర్టు తెలంగాణలో ఉన్నా అక్కడ హెల్త్ అసిస్టెంట్ల తొలగింపుపై ఆచితూచి స్పందిస్తుంటే రాష్ట్రంలో మాత్రం ఏకపక్షంగా తొలగించారు.

– కొప్పిశెట్టి నాగేంద్ర, హెల్త్ అసిస్టెంట్, కాట్రేనికోన సీహెచ్‌సీ

విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు

అమలాపురం రూరల్: విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు అని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి అన్నారు. శనివారం అమలాపురంలో ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని ఆమె ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి గడియారం స్తంభం వరకూ ఈ ర్యాలీ సాగింది. ట్రాన్స్‌కో ఉద్యోగులు పాల్గొని ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భావితరాలకు సహజ వనరులను అందించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా ఇంధన పొదుపు చేయాలన్నారు. ఇంధన సంరక్షణ సామర్థ్యాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేందుకు ఈ వారోత్సవాలను శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫైవ్ స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ గృహోపకరణాలు వినియోగించడం ద్వారా 30 శాతం విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. ఇంధనం లేకుండా ఒక్క క్షణం కూడా గడవదంటే అతిశయోక్తి కాదన్నారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఎస్.రాజబాబు మాట్లాడుతూ సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్ వనరులపై ఆధారపడాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లకు బదులుగా బయో ఇంధన వనరులను, బయో డీజిల్, బయో గ్యాస్ వంటి వాటిపై ఆధారపడాలన్నారు. కార్యక్రమంలో ఈఈ మోకా రవికుమార్, కె.రత్నాలరావు, వై.విజయనాథ్, డీఈఈలు అన్నవరం, శ్రీనివాస్, చిట్టిరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ నిషాంతి

రత్నగిరిపై జనఝరి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానం ఆదాయం రూ.40 లక్షలు
- తిరుచ్చి వాహనం మీద ఘనంగా స్వామివారి ప్రాకారసేవ
- రత్నగిరి పై నేడు పెద్ద సంఖ్యలో జరగనున్న వివాహాలు

అన్నవరం: సత్యదేవుని ఆలయం శనివారం వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు కావడంతో పాటు, శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున సుమారు 50 వివాహాలు జరగడంతో భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులు భోజనం చేశారు. అలాగే అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో స్వామివారికి దేవేరులతో పాటు తిరుచ్చి వాహన సేవ నిర్వహించారు. కాగా, ఆదివారం ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను టేకు రథంపై ఆలయ ప్రాకారంలో ఘనంగా ఊరేగించనున్నట్లు అధికారులు తెలిపారు.



సత్యదేవుని దర్శనానికి వెళ్తున్న భక్తులు

నేడు కూడా భారీ సంఖ్యలో వివాహాలు

రత్నగిరిపై మార్గశిర పౌర్ణిమ, ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగనున్నాయి. ఇప్పటికే దేవస్థానంలోని సత్రాలలో గదులు, విష్ణుసదన్‌లోని కల్యాణ మండపాలు, సత్య శ్రీనివాస కల్యాణ మండపం, ఎంఎస్ రెడ్డి అంజనీ ఉచిత వివాహ వేదికలో 24 వివాహ వేదికలను పెళ్లి బృందాలు రిజర్వ్ చేసుకున్నాయి.

రేవంత్ అనుచిత వ్యాఖ్యలు సమంజసం కాదు



సంసాని వెంకట చంద్రశేఖర్

సాక్షి, అమలాపురం: జాతీయ ఉత్తమ నటుడు అవార్డు గ్రహీత అల్లు అర్జున్ అరెస్ట్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు అతని హోదాకు తగినట్టు లేవని వైఎస్సార్ సీపీ అమలాపురం పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకట చంద్రశేఖర్ (బులి నాని) అన్నారు. అమలాపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అల్లు అర్జున్ అరెస్ట్‌ను ఖండిస్తున్నామన్నారు. పుష్ప-2 సినిమా రిలీజ్ రోజున మహిళ మృతికి సానుభూతి తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు అల్లు అర్జున్‌ను బాధ్యుడిని చేయడం తగదన్నారు. అరెస్ట్‌ను ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అల్లు అర్జున్ ఈ దేశం కోసం యుద్ధం చేశారా? విజయాలు తెచ్చారా? పెట్టుబడి పెట్టారు.. డబ్బులు సంపాదించుకున్నారు అని చులకనగా మాట్లాడటం దారుణమన్నారు. సినీ పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గుర్తించాలన్నారు.

సామాన్ల కోట



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో స్టీల్ సామగ్రి దుకాణాలకు వెళ్లే రోడ్డు

- వంటింట్లో ఇక్కడి స్టీల్ వస్తువులదే కీలక'పాత్ర'
- నాణ్యత, మన్నిక, అందుబాటు ధరలతో పరిసర ప్రాంత ప్రజల మన్ననలు
- శుభాశుభ కార్యాలలో బహుమతులకు, దాతల పేర్లు రాసి ఇచ్చేలా ఏర్పాట్లు

సండే స్పెషల్

సామర్లకోట: కాలం మారింది.. మట్టి పాత్రల వినియోగం కనుమరుగైంది.. వాటి స్థానంలో తళతళలాడే స్టీల్ పాత్రలు, వంట సామగ్రి వంటిళ్లను ఆక్రమించాయి. ఇళ్లకు సైకిల్ మీద తీసుకువచ్చే చిరు వ్యాపారుల దగ్గర నుంచీ పెద్ద పెద్ద బహుళ అంతస్తుల మాల్స్‌లో సైతం వీటికోసం ఓ ఫ్లోరే కేటాయిస్తుంటారంటే వీటి వినియోగానికి మహిళలు ఇచ్చే ప్రాధాన్యం ఎంతో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఈ స్టీలు పాత్రల తయారీ, భారీస్థాయిలో వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్ మన సామర్లకోట అని చెప్పడం గర్వించదగ్గ విషయం. సుమారు ముప్పై ఐదు ఎకరాల విస్తీర్ణంలో 1965లో ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటైంది. ప్రస్తుతం 65 వరకూ చిన్న తరహా పరిశ్రమలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే 1980లో ఈ ఎస్టేట్‌లో స్టీల్ సామగ్రి తయారీకి బీజం పడింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రారంభంలో స్టీల్ కంచాలు, గ్లాసులు, బియ్యం డబ్బాలు, క్యారేజీలు, కంచాలు తయారు చేసేవారు. వాటి తయారీకి స్టీల్ షీట్‌లను సేలం, అహ్మదాబాద్, ముంబయి నుంచి తీసుకొచ్చి ప్రజలకు అవసరమైన వంటింటి సామగ్రిని అత్యంత నాణ్యంగా తయారు చేసేవారు. ఇలా సామర్లకోట స్టీల్‌కు డిమాండ్ పెరగడంతో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఈ సామగ్రి విక్రయించే సంస్థలు పెరిగాయి. క్రమేపీ స్టీల్ సామగ్రి విక్రయాలకు పోటీ పెరగడం, స్థానికంగా తయారు చేసే స్టీల్ సామగ్రికి ఖర్చు అధికమవడంతో వ్యాపారులు ఆ తయారీకి స్వస్తి చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి స్టీల్ సామగ్రిని హోల్ సేల్‌గా తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

బహుమతులకు డిమాండ్

పెళ్లిళ్లు, పుట్టిన రోజులు, బారసాల తదితర శుభకార్యాలు, అశుభ కార్యక్రమాల సందర్భాలలో బంధుమిత్రులకు బహుమతులుగా ఇచ్చుకునేందుకు, దాతల పేర్లు రాసి ఇచ్చేందుకు ఇక్కడి స్టీల్ సామగ్రిని కొనుగోలు చేయడానికి సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో తరలివస్తుంటారు. దీంతో స్టీల్ సామగ్రి సంస్థలు నిత్యం కళకళలాడుతున్నాయి. ఇక్కడి సంస్థల్లో అనేక రకాల గిఫ్ట్ ఐటెమ్స్ కూడా విక్రయానికి ఉంచుతున్నారు. గ్లాసుల నుంచి భోజనం పెట్లు, బిందెలు, డబ్బాలు, క్యారేజీలు ఎక్కువగా విక్రయిస్తున్నారు. రూ.100 నుంచి రూ.200 వరకూ ఉండే సామగ్రిని ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుతున్నారు. రూ.500 నుంచి అంతకు మించి ఖరీదు కలిగిన సామగ్రి కావాల్సిన వారికి ఆర్డర్ల ప్రకారం రెండు నుంచి మూడు రోజుల్లో ఇస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు..

ప్రజలకు అవసరమైన స్టీల్ సామగ్రిని సేలం, బెంగళూరు, అహ్మదాబాద్, ముంబయి, మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి హోల్ సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేసి ఇక్కడి ప్రజలకు అందుబాటు ధరల్లో విక్రయిస్తుండడంతో సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో స్టీల్ సామగ్రికి నేటికి అదే స్థాయిలో గిరాకీ కొనసాగుతోంది. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రముఖమైన మూడు సంస్థలలో స్టీల్ సామగ్రి విక్రయిస్తుంటారు. ఈ సంస్థలలో రోజుకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు విక్రయాలు సాగుతున్నట్టు అంచనా. శుభ ముహూర్తాల సీజన్లలో ఈ విక్రయాలు మరింత అధికంగా సాగుతాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారి ఆర్డర్ల మేరకు వారికి సామగ్రి పార్శిల్ చేసి పంపుతారు. ఒక్కొక్క సంస్థలో 10 నుంచి 30 మంది వరకు యువతకు ఉపాధి కల్పిస్తున్నారు. విశాఖపట్నం, నర్సీపట్నం, భద్రాచలం, నిడదవోలు, రావులపాలెంల నుంచి స్టీల్ సామగ్రి కొనుగోలుకు ఇక్కడికి ఎక్కువగా వస్తారు. బహుమతులు ఇచ్చిన వారి పేరు గుర్తు ఉండే విధంగా స్టీల్ సామగ్రిపై పేర్లు ముద్రించే ఏర్పాట్లు ఇక్కడి ప్రతి దుకాణంలో ఉంటాయి.

ఇళ్ల గ్రిల్స్ తయారీ

కేవలం వంటింటి సామగ్రే కాకుండా ఇంటికి అవసరమైన గ్రిల్స్ తయారీ చేయడంలో ఇక్కడి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు మంచి పేరు ఉంది. భవనాల ప్రహరీ, మెట్ల ప్రహరీ, బాల్కనీలకు స్టీల్ గ్రిల్ ఏర్పాటు చేస్తారు. తక్కువ ఖర్చుతో అందంగా స్టీల్ గ్రిల్ రావడంతో ప్రతి ఒక్కరూ వీటిపై మక్కువ చూపుతున్నారు.

మన్నిక బాగుంటుందని..



సామర్లకోట స్టీల్ సామగ్రి దుకాణాలలో సరకులు నాణ్యతతో మన్నికగా ఉంటాయి. అందుకే దూర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నాం. 20 ఏళ్ల క్రితం మా అమ్మ సామర్లకోటలో కొన్న స్టీల్ సామగ్రి ఇప్పటికి చెక్కు చెదరలేదు. సామర్లకోటలోని బంధువుల ఇంటికి వచ్చిన సమయంలో స్టీల్ సామాన్ల దుకాణానికి వచ్చి కావాల్సినవి కొనుక్కుని తీసుకువెళ్తుంటా.

– మాధవి, గృహిణి, విశాఖపట్నం

ధరలు తక్కువ



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న స్టీల్ సామగ్రి షాపులకు మంచి గుర్తింపు ఉంది. దాంతో నాణ్యమైన సరకులను ఇతర ప్రాంతాల కంటే తక్కువ ధరలకు విక్రయిస్తుంటాం. వినియోగదారుల ఆర్డర్ల ప్రకారం సరకులను ఇళ్లకు పంపే ఏర్పాటు కూడా ఇక్కడ ఉంది. దూర ప్రాంతాల నుంచి అనేక మంది వస్తూ ఉంటారు.

– కటకం సతీష్, వ్యాపారి, సామర్లకోట.



కంప్యూటర్‌తో సామగ్రిపై పేర్లు వేస్తున్న సిబ్బంది



విక్రయానికి సిద్ధంగా ఉన్న స్టీల్ సామగ్రి



ఇతర ప్రాంతాలకు పార్సిల్ చేస్తున్న కార్మికుడు



వైభవంగా భీమేశ్వరుని జన్మ నక్షత్ర పూజలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో స్వయంభువునిగా వెలసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి జన్మ నక్షత్రం (రోహిణి) పురస్కరించుకుని శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారిని నంది వాహనంపై ఊరేగించారు. రాత్రి ఆస్థాన మండపంలో స్వామివారికి ఆస్థాన పూజ చేసి, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. భారీ ఎత్తున అన్న ప్రసాద వితరణ జరిగింది. ఇదిలాఉంటే మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో శివస్వాములు శివ దీక్షలను విరమించారు. ఈ సందర్భంగా మాస శివరాత్రి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, సరోజిని దంపతుల పర్యవేక్షణలో భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై మహాకుంభాభిషేకం కన్నుల పండువగా సాగింది. ఏకకాలంలో 1008 శివ లింగాలకు శివస్వాములు, భక్తులు స్వహస్తాలతో అభిషేకాలు చేశారు. అనంతరం రుద్ర హోమం, నవగ్రహ హోమాలు జరిగాయి. వేల మంది భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఎంచుకుని.. పంచుకుని

- నీటి సంఘాల ఎన్నికల్లో సిత్రాలు
- పలుచోట్ల ఘర్షణలు, వాయిదాలు

నీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నో సిత్రాలు జరిగాయి.. అధికార పార్టీలకు చెందిన నేతలు తమకు నచ్చిన చోట పాగా వేసేందుకు ఎంచుకుని పంచుకున్నారు.. కొన్నిచోట్ల రైతులంతా ఏకమై కూటమి నేతలకు షాక్ ఇచ్చారు.. పలుచోట్ల వాగ్వాదాలు జరగడంతో ఎన్నిక వాయిదా వేయాల్సి వచ్చింది.



తాటిపర్తిలో ఎన్నికల కేంద్రం గేట్లు తోసుకుంటూ వస్తున్న ఒక వర్గం

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో 36 నీటి సంఘాలకు శనివారం అధికారులు ఎన్నికలు నిర్వహించారు. గతంలో టీడీపీ జనసేన మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఆయా గ్రామాల్లో అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. టీడీపీ, జనసేనకు అనుకూలంగా ఉన్నచోట్ల ఎన్నికలు ఏకగ్రీవం చేయించుకున్న నేతలు అనుకూలంగా లేని రెండు చోట్ల కావాలనే వాయిదాలు వేయించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉండగా, గొల్లప్రోలు మండలం తాటిపర్తి నీటి సంఘం ఎన్నికల్లో కొందరు రైతులు టీడీపీ, జనసేనకు వ్యతిరేకంగా పోటీలోకి దిగారు. దీంతో ముందుగా వ్యతిరేక వర్గం రైతులు ఎన్నికల కేంద్రానికి వెళ్లి తమ నామినేషన్లు వేశారు. ఇంతలో నామినేషన్లు వేసే సమయం మించిపోవడంతో అధికారులు ఎన్నికల కేంద్రం గేట్లు మూసివేశారు. తర్వాత టీడీపీ, జనసేనకు చెందిన మరోవర్గం ఎన్నికల కేంద్రానికి నామినేషన్లు వేసేందుకు రాగా అధికారులు అడ్డుకున్నారు. దీంతో వారు ఆందోళనకు దిగారు. పోలీసులు, అధికారులను తోసుకుంటూ గేట్లు దాటి లోపలకు వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికలు వాయిదా వేయాలని నినాదాలు చేశారు. దీంతో ఎన్నికల



మల్లవరంలో అధ్యక్ష ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న అధికారులు

అధికారి దాసం లక్ష్మీనారాయణ ఎన్నికల కేంద్రం వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగిందంటూ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ అదనపు పోలీసు బలగాలను రప్పించి రెండు వర్గాలను ఎన్నికల కేంద్రం నుంచి బయటకు పంపించి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

- అలాగే గొల్లప్రోలు మండలం మల్లవరంలో పిఠాపురం బ్రాంచి కెనాల్ పీబీసీ నీటి సంఘం ఎన్నికను టీడీపీ, జనసేన ఒప్పందంలో భాగంగా టీడీపీకి కేటాయించినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా సంఘంలో ఉన్న 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా టీడీపీ బలపరిచిన తటవర్తి కొండయ్య పీబీసీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. అయితే టీడీపీకి రెబల్‌గా చెబుతున్న ఒక రైతు టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసి తన తరఫున 8 మంది డైరెక్టర్లను తిప్పుకున్నట్లు చెబుతున్నారు. రెబల్ అభ్యర్థికి జనసేనకు చెందిన డైరెక్టర్లు పరోక్షంగా మద్దతు పలికినట్లు చెప్పుకుంటున్నారు. దీంతో అధ్యక్ష ఎన్నికలో రెబల్ అభ్యర్థి తరఫున మరో డైరెక్టర్ పాలకుర్తి సత్యనారాయణ పోటీలోకి దిగారు. ఇద్దరి నామినేషన్లు తీసుకున్న అధికారులు అధ్యక్ష ఎన్నిక నిర్వహించడానికి ఏర్పాట్లు చేసి డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి వచ్చిన తటవర్తి కొండయ్య ఎన్నికల జరుగుతుండగా, బయటకు వెళ్లి వరండాలో పడిపోవడంతో అతనిని అధికారులు ఆస్పత్రికి తరలించారు. దీంతో నామినేషన్ వేసిన అభ్యర్థి అందుబాటులో లేక ఎన్నికను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి కుమార్ ప్రకటించారు. అయితే కోరం ఉన్నప్పటికీ అధికారులు కావాలనే ఎన్నికను వాయిదా వేశారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఎక్కడా తగ్గేదే లే

ఎమ్మెల్యేని కాదని పట్టు సాధించుకున్న రైతులు

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడి సాగునీటి సంఘం ఎన్నిక ఘర్షణ వాతావరణాన్ని తలపించింది. రైతులు ఒక వర్గం, ఎమ్మెల్యే వర్గీయులు మరో వర్గంగా విడిపోవడంతో వివాదం తలెత్తింది. ఎమ్మెల్యే నిర్ణయించిన అభ్యర్థిని రైతులు వ్యతిరేకించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.పెదపూడి సాగునీటి సంఘ అధ్యక్షుడిగా అదే గ్రామానికి చెందిన మండల బీజేపీ అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబును ఏకగ్రీవం చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నిర్ణయించారు. ఈ విషయాన్ని తమతో సంప్రదించకుండా ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని జి.పెదపూడికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలతో పాటు కొందరు రైతులు నిరసన వ్యక్తం చేశారు. సాయిబాబు కూడా తమను సంప్రదించలేదని రైతులు తెలిపారు. ఎమ్మెల్యే సూచించిన అభ్యర్థి సాయిబాబు 6వ టీసీ స్థానం నుంచి ఏకగ్రీవం చేసి, సంఘం అధ్యక్షునిగా పోటీ చేయాలనుకున్నారు. ఈ నేపథ్యంలో సాయిబాబును ఓడించి అతనికి అధ్యక్షుడిగా అవకాశం రాకుండా చేయాలని రైతులు నిర్ణయించారు. దీంతో అక్కడ బొరుసు సూర్య వెంకటకృష్ణారావును పోటీలో ఉంచడానికి రైతులు, పరోక్షంగా జనసేన, టీడీపీలకు చెందిన కొందరు గ్రామ కార్యకర్తలు ప్రణాళిక రచించారు. ఈ నేపథ్యంలో ఉదయం ఊడిమూడి ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రానికి 8 గంటలకు రైతులు చేరుకున్నారు. స్వతంత్ర అభ్యర్థికి మద్దతుగా ఎక్కువ మంది రైతులు వచ్చారు. దీంతో ఎమ్మెల్యే వర్గీయులు సాయిబాబుతో పాటు ఎంపీటీసీ పల్లి మోషే తదితరులు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. 6వ టీసీ స్థానంలో చాలా మంది రైతుల ఓట్లు లేవని, చనిపోయిన వారి ఓట్లు ఉన్నాయని ఎన్నికలు వాయిదా వేయాలని పోలింగ్ అధికారిని డిమాండ్ చేయడంతో వివాదం మొదలైంది. ఇక్కడ దొంగ ఓటర్లు లేరని ఎన్నికలు జరపాలని రైతులు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో తన వద్ద ఉన్న పేపర్లు లాక్కునేందుకు ప్రయత్నించారని పోలింగ్ అధికారి తెలిపారు.



జి.పెదపూడిలో అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రత్యర్థి వర్గీయులు



జి.పెదపూడిలో 6వ టీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన కృష్ణారావు

సీఐ భీమరాజు, ఎస్సై బి.శివకృష్ణలు అక్కడకు వచ్చి ఇతరులను అక్కడి నుంచి బయటకు పంపించేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే సత్యనారాయణ అక్కడకు చేరుకుని ఎన్నికల అధికారి కేవీ ప్రసాద్‌తో మాట్లాడారు. కొందరు రైతులు ఓట్లు లేవంటున్న కారణంగా ఎన్నిక వాయిదా వేయాలని కోరారు. దీంతో 6వ టీసీ ఎన్నికను నిలిపివేశారు. అనంతరం ఎమ్మెల్యే మళ్లీ సమస్యలు లేకుండా ఎన్నిక జరపాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటలైనా ఎన్నిక జరపకపోవడంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్త చేశారు.

మార్కెట్ కమిటీ ఇస్తానన్నా..

6వ టీసీ స్థానం నుంచి రైతులు పోటీలో నిలిపిన అభ్యర్థి కృష్ణారావుకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి ఇస్తామని, పోటీ నుంచి తప్పుకుని సాయిబాబుకు అవకాశం ఇవ్వాలని కార్యకర్తల ద్వారా ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు నామన రాంబాబు, ఆకుల రామకృష్ణ తదితరులు రైతులతో చర్చలు జరిపారు. అందుకు వారు అంగీకరించలేదు. రైతులు ఎంతకీ తగ్గకపోవడంతో చివరికి సాయిబాబు తగ్గిపోతున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. దీంతో మధ్యాహ్నం 12.30 గంటలకు 6వ టీసీగా కృష్ణారావు ఏకగ్రీవం అయ్యారు.

డెల్టాలో నీటి సంఘాల సెలక్షన్

- ఎమ్మెల్యేల నిర్ణయం
- చేతులెత్తి అంగీకరించిన కూటమి రైతులు

సాక్షి, అమలాపురం: ఎన్నికల్లో అడ్డదారిలో గెలుపు ఎంత సునాయాసంగా ఉంటుందో కూటమి నేతలు మరోసారి నిరూపించారు. ఎలక్షన్ పేరుతో సాగు నీటి సంఘాలకు ప్రభుత్వం నిర్ణయించిన సెలక్షన్ జిల్లాలో విజయవంతంగా సాగింది. రాష్ట్రంలోనే కీలకమైన గోదావరి డెల్టాలో శనివారం సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ ప్రహసనంగా సాగింది. గోదావరి డెల్టాలో తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 249 వాటర్ యూజర్స్ కమిటీ డబ్ల్యూయూఏలకు ఎన్నికలు జరిగాయి. పలుసార్లు వాయిదా పడిన ఎన్నికల ప్రక్రియలో తొలిదశలో గ్రామ స్థాయిలో డబ్ల్యూయూఏలకు ఎన్నికలు నిర్వహించారు. కోనసీమ జిల్లా పరిధిలో తూర్పు, మధ్య డెల్టాలకు సంబంధించి 16 డీసీల పరిధిలో 83 డబ్ల్యూయూఏలకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 983 టీసీలకు ఎన్నికలు జరిగాయి. జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు ఎంపిక చేసిన వారిని గ్రామసభల్లో ఆ పార్టీ కార్యకర్తలు ఎన్నుకున్నారు. సంఖ్యా బలం తక్కువగా ఉన్నచోట సైతం ఎన్నికలు నిర్వహించి అధికారులు అధికార పార్టీ సేవలో తరించారు. టీసీ అభ్యర్థులను ప్రకటించడం, జనం చప్పట్లతో ఆమోదించడం షరా మాములుగా సాగిపోయింది. ఈ మాత్రం ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, నామినేషన్ల ప్రక్రియ చేపట్టడం వంటివి ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ఆయకట్టలలో ఒకటైన గోదావరి డెల్టా నీటి సంఘాల ఎన్నికలలో 90 శాతం మంది నీటి యాజమాన్య నిర్వహణ, చట్టాలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కనీస అవగాహన లేని అధికార పార్టీ నేతల అనుచరులు ఎన్నిక కావడం.. వారు ఎన్నిక అయ్యేలా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాదేశిక నియోజకవర్గాలకు, సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరిగాయన్నారు. ఈ నెల 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

యువకుడి మృతి

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బెంగళూరుకు చెందిన చేతన్ గౌడ్ (19) ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్‌లో ఓ బేకరీలో కొంత కాలంగా పని చేస్తున్నాడు. శుక్రవారం యథావిధిగా పని ముగించుకుని స్థానిక ఓవర్ హెడ్ ట్యాంకు సమీపంలో తోటి పనివారితో కలసి అతను నివాసం ఉంటున్న ఇంటికి వచ్చాడు. రాత్రి నిద్రించిన చేతన్ గౌడ్ శనివారం ఉదయం అచేతనంగా పడి ఉండటాన్ని గమనించి అతనితో కలసి ఉంటున్న యువకులు లేపేందుకు ప్రయత్నించిన లేవకపోవడంతో ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే విగత జీవిగా ఉన్న చేతన్ గౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దాడి ఘటనపై ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఏపీ అంతా జల్లెడ పడుతున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసులపై దాడి చేసి, దొంగనోట్ల ముఠా తమ నాయకుడిని సినీఫక్కీలో విడిపించుకుపోయిన ఘటనపై పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి స్థానిక ప్రకాశ్‌నగర్ సీఐ బాజీలాల్ శనివారం ఆ వివరాలను తెలిపారు. శ్రీకాకుళం ప్రధాన కేంద్రంగా సాగుతున్న ఈ దందాలో ముఖ్య అనుచరుడిగా భావిస్తున్న రాపాక ప్రభాకర్ (ప్రతాప్ రెడ్డి)ని భీమవరంలో అరెస్టు చేసిన శ్రీకాకుళం పోలీసులు మరో నిందితుడు కృష్ణమూర్తి రాజమహేంద్రవరంలో ఉన్నట్లు తెలుసుకుని వచ్చి ఇక్కడ పోలీసుల సహాయంతో అతనిని వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో వెనుదిరిగిన పోలీసులకు వీఎల్ పురం సమీపంలో ఒక్కసారిగా ఊహించని పరిణామం ఎదురైంది. వారు ప్రయాణిస్తున్న వాహనానికి అడ్డంగా రెండు కార్లు, కొన్ని మోటారు సైకిళ్లతో అడ్డుగా కొందరు వచ్చారు. తర్వాత పోలీసులపై దాడి చేసి ప్రభాకర్‌ను తీసుకుపోయిన సంగతి విదితమే. ఈ సంఘటనపై పోలీసు యంత్రాంగం ఒక్కసారిగా ఉలికి పడింది. వీరంతా ఎక్కడి వారు, శ్రీకాకుళం నుంచే ముందుగా వచ్చారా, లేక ప్రధాన నిందుతుడిగా భావిస్తున్న ప్రభాకర్ ఉంటున్న భీమవరానికి చెందిన వారా.. అనే పలు విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. దుండగులు ఎటువైపు నుంచి వచ్చారు, పోలీసులపై దాడి చేసి నిండితుడిని ఎటువైపు తీసుకెళ్లారనే విషయాలు తెలుసుకునేందుకు రాజమహేంద్రవరం వైపు వచ్చే హైవేలు, ప్రధాన రహదారులతో పాటు, సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మరో రెండు రోజుల్లో పోలీసులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

రామచంద్రపురం: హైదరాబాద్‌లో ఆదివారం నుంచి జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు సబ్ జూనియర్స్ బాలుర జట్టును ఎంపిక చేసినట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి వెల్లడించారు. ఈ మేరకు పది రోజులుగా స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ప్రత్యేక శిక్షణ అనంతరం రాష్ట్ర స్థాయి బాలుర జట్టును ప్రకటించామన్నారు. కాగా సబ్ జూనియర్ బాలికల రాష్ట్ర స్థాయి జట్టును పశ్చిమగోదావరి జిల్లా వల్లంపట్రు మాంట్ సోర్సిస్ స్కూల్‌లో కోచింగ్ అనంతరం ప్రకటించారని అన్నారు. బాలుర జట్టులో ఎస్.సాయిచరణ్, ఇ.ఛార్లెస్ వెస్లీ, వై.సుశ్రిత్, జి.జగదీష్, కె.ప్రణీత్, బీఎస్ కార్తికేయ, పి.జీవన్, టి.గౌతమ్, ఎ.మనూ అభిరామ్, బి.సత్యానంద, బి.ఉత్పలశ్వర్ సాయి ఉన్నారు. బాలికల జట్టులో సీహెచ్ ఐశ్వరాంబిక, బి.సాలినీరత్నమాధురి, బి.కుసుమ, బి.హాసినీ, కె.అముకుత, టి.అంజలి, వై.హిమవర్షిణి, ఏవీఎల్ అక్షయ, ఎస్.జాస్మిన్, బి.వర్షిణి, సీహెచ్ భువనేశ్వరి ఉన్నారు.

వ్యాన్ బోల్తా : వృద్ధుడి మృతి

చింతూరు: కొద్ది సేపటిలో గమ్యం చేరాల్సిన ఆ వృద్ధుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. చింతూరు మండలం వీరాపురం వద్ద శనివారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం శ్రీరామపురానికి చెందిన కామశెట్టి చంద్రరావు (75) కుటుంబం కొన్నేళ్లుగా చింతూరు మండలానికి సరిహద్దునే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంటలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పండ్ల లోడుతో వ్యాన్‌లో భార్య లక్ష్మితో కలసి చంద్రరావు చింతూరు మీదుగా కుంట బయలు దేరారు. తెల్లవారుజామున వీరాపురం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడటంతో చంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకు వచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో అతని భార్య లక్ష్మి, వ్యాన్ నడుపుతున్న మనుమడు శ్రీరామ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మరో పది నిమిషాల్లో గమ్యస్థానం చేరుకోనున్నారు. ఈ లోపే ఊహించని పరిస్థితుల్లో సంభవించిన ప్రమాదం ఆ వృద్ధుడిని అనంత లోకాలకు తీసుకుపోయింది. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అధికారుల ఒత్తిడితో వీఓఏ మృతి

కాట్రేనికోన: పల్లంకుర్రులో స్త్రీనిధి రుణాలపై శుక్రవారం ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. తమ పరిధిలోని సభ్యులు కట్టాల్సిన స్త్రీనిధి రుణాల బకాయిలు తక్షణమే చెల్లించాలని వీఓఏ దెక్కల మంగాదేవి (45)కి వారు సూచించారు. ఈ నేపథ్యంలో ఆందోళనకు గురైన ఆమె శుక్రవారం రాత్రి చర్చికి వెళ్లి వస్తుండగా, ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. మహిళా సంఘంలో చురుకుగా ఉంటూ సంఘ సభ్యులకు అందుబాటులో ఉండే వీఓఏ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న సభ్యులు సకాలంలో చెల్లించకపోతే వీఓఏలు చెల్లించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తుండడం సరికాదని మండల పరిధిలోని వీఓఏలు శనివారం కాట్రేనికోనలో రాష్ట్ర మత్స్య శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. స్త్రీనిధి రుణాల చెల్లింపులు చెక్కు లేదా పేటీఎమ్ ద్వారా చెల్లించాల్సి ఉండగా, నగదు తీసుకోవాలని ఒత్తిడి చేయడం సరికాదని వారన్నారు. చెల్లించిన సొమ్ము సభ్యుల రుణాలకు జమ కావడం లేదని, ఆ సొమ్ము ఎక్కడికి పోతుందో తెలియడం లేదన్నారు.



ఉన్నతాధికారుల ఒత్తిడి ఎక్కువైందని రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేశ్వరరావుకు వినతి అందజేస్తున్న వీఓఏలు